క్లుప్తంగా

ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు



గోకవరంలో వాసవీమాతకు సారె సమర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు దంపతులు

గోకవరం: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను బుధవారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకులు శ్రీరామ్మూర్తి, కృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్తిబాబు దంపతులు సారె సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత జగ్గంపేట జట్టు



టోర్నీ విజేత జగ్గంపేట జట్టుకు మెమెంటోను అందజేస్తున్న నిర్వాహకులు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో గ్రామానికి చెందిన (ఎన్నారై) కల్లేపల్లి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా జగ్గంపేట జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో వేలంగి, జగ్గంపేట జట్లు తలపడగా జగ్గంపేట జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది. విజేతలకు నగదు బహుమతితో పాటు మెమెంటోను జేఎస్సీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, రాజేష్ కుటుంబ సభ్యుడు శంకర్ చేతుల మీదుగా అందజేశారు.

తాండవలో మహిళ మృతదేహం



తాండవ నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

తుని: స్థానిక కట్రాకోండ పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్ పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహన్ని గుర్తించినట్టు ఎస్సై విజయ్ బాబు తెలిపారు. బుధవారం ఉదయం స్థానికులు మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మృతదేహన్ని బయటకు తీశారు. మృతురాలి వయస్సు (50) ఉంటుందని, నీలరంగు చీర ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలియలేదని, తెలిస్తే తుని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆకాశ పందిరిలో...

- వేద ఘోష నడుమ
- వధూవరులైన సత్యదేవుడు అమ్మవారు
- పట్టువస్త్రాలు సమర్పించిన చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు దంపతులు
- భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికారులు



వధూవరులుగా ప్రత్యేక అలంకరణలో శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు

అన్నవరం: సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి వధూవరులైన శుభ తరుణంలో రత్నగిరి పులకించింది. వారం రోజుల పాటు వైభవంగా సాగనున్న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి, బుధవారం సాయంత్రం పండితులు శ్రీకారం చుట్టారు.

సీతారాములే పెళ్లి పెద్దలుగా...

రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా సత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపం వద్దకు తీసుకువచ్చి చూడముచ్చటైన వేదికపై ప్రతిష్ఠించి వధూవరులుగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా, పండితులు వేదాశీస్సులు ఇచ్చారు.

పసుపు దంచిన ముత్తయిదువులు

వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ తదితరుల ఆధ్వర్యంలో ముత్తయిదువులు పసుపు దంచారు.

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

ఈ సందర్భంగా రామరాయ కళావేదికపై రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సత్యదేవుడు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని పండితుల హాస్యోక్తులతో వైభవంగా నిర్వహించారు. స్వామివారే గొప్పవారని అమ్మవారి తరపు వారిని తక్కువ చేసేలా మాట్లాడడం, అమ్మవారి తరపువారు అయ్యవారి తరపువారికి దీటైన బదులివ్వడం చతురోక్తులతో హృద్యంగా నిర్వహించారు.

నేడు సత్యదేవుని దివ్యకల్యాణం

కాగా, వైశాఖ శుద్ధ ఏకాదశి, గురువారం రాత్రి 9.30 గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవార్ల దివ్యకల్యాణాన్ని వార్షిక కల్యాణవేదికపై ఘనంగా నిర్వహించేందుకు అధికారుల ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తదితర అధికారులను ఆహ్వానించారు.

పటిష్ట ఏర్పాట్లు

స్వామివారి కల్యాణానికి సుమారు 25 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూసేలా వేదిక ముందు టీవీ, స్క్రీన్‌ల ద్వారా ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షింతల ప్యాకెట్లను సర్క్యులర్ మండపంతో పాటు పశ్చిమ రాజగోపురం వద్ద తొమ్మిది చోట్ల పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదాన భవనంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కొండ మీదకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకు ఉచిత బస్సులను కొండమీదకు నడుపుతున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీటి సరఫరాకు వలంటీర్లు, సేవా కార్యకర్తలను ఏర్పాటు చేశారు. వీఐపీలు, మహిళలు, భక్తులు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తునికి చెందిన అగ్ని మాపక శకటాన్ని ఏర్పాటు చేశారు.



శుభం కోరుతూ పసుపు దంచుతున్న ముత్తయిదువులు



కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు



అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, 8 గంటలకు చతుర్వేదపారాయణ, 9 అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, దీక్షా వస్త్ర ధారణ. రాత్రి 7 గంటలకు కొండ దిగువన స్వామివారిని వెండి గరుడ వాహనంపై, అమ్మవారిని వెండి గజవాహనంపై, పెళ్లిపెద్దలైన సీతారాములను వెండి పల్లకీపై ఊరేగింపు. అలాగే రాత్రి 9 గంటలకు రత్నగిరి కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అలాగే రత్నగిరి కళావేదికపై, కొండదిగువన ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యంలోడు లారీని పట్టుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ పోర్టుకు తరలిస్తున్న సుమారు 28.6 టన్నుల రేషన్ బియ్యాన్ని ఏపీ 39 యూడీ 6507 లారీపై తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో తమ్మయ్యపేట జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. లారీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. లారీ ప్రయాణిస్తున్న నల్లజర్లకు చెందిన వినాయక ట్రేడర్స్ ప్రతినిధి మద్దు సత్యనారాయణమూర్తి, లారీ డ్రైవర్ గొలుసు శంకరరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. నిల్వ విలువ రూ.29 లక్షలు ఉంటుందన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఐసెట్ పరీక్షలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం ఏపీ ఐసెట్–2025 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 4.30 గంటల వరకూ రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించామన్నారు. 700 మందికి గాను 632 మంది పరీక్షలకు హాజరైనట్టు వివరించారు.

తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



కిర్లంపూడిలో కల్యాణ అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు



తంటికొండలో వెంకన్న కల్యాణోత్సవానికి పందిరిరాట వేస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9.05 గంటలకు పందిరి రాట వేసి స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణతులసి దంపతులు తాంబూలాలు ఇచ్చారు. సాయంత్రం ధ్వజారోహణ, అంకురార్పణ, విశేష హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిల్లంగిలో...

కిర్లంపూడి: మండల పరిధిలోని చిల్లంగి శ్రీనివాస నగర్‌లో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల రాఘురామచార్యులు(రఘు), జగన్నాథచార్యులు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్వామివారిని పెండ్లికొడుకు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కోలాట నృత్యాలు, బ్యాండ్ మేళాలు, భక్తుల నడుమ స్వర్ణరథంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

యుద్ధ సన్నద్ధతపై ప్రజలకు అవగాహన

తొండంగి: దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్‌పై యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యుద్ధ సన్నద్ధతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ మురార్జీ, ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వైద్యారోగ్య శాఖ, అన్నిశాఖల మండలస్థాయి అధికారులతో పాటు పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. యుద్ధానికి గ్రామాల్లో పౌరులను సన్నద్ధత చేయడంతో పాటు శత్రుదాడి నుంచి రక్షణ ఏవిధంగా పొందాలి అన్న అంశంపై అవగాహన కల్పించారు. అనంరతం తొండంగి ప్రధాన సెంటర్లో ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. దేశరక్షణ కోసం సామన్య ప్రజలు, యువత సిద్ధం ఉండాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లోనూ మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వైద్యాధికారులు పి.రవికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోటనందూరు: పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యుద్ధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సుభాష్, ఎంపీడీఓ వెంకటనారాయణ యుద్ధం సంభవిస్తే ప్రజల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షించే విధానం, అందించాల్సిన వైద్య సేవలు తదితర అంశాలపై ప్రజలు, ప్రభుత్వ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించడంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.



తొండంగిలో యుద్ధం నుంచి పౌర రక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

యుద్ధం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: పాకిస్తాన్‌తో యుద్ధం అనివార్యమైతే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధం వస్తే ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడకుండా ఒకరికొకరు సాయపడుతూ ప్రభుత్వానికి సహాయం అందించాలని తహసీల్దార్ సూర్యప్రభ కోరారు. యుద్ధం వస్తే పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలను పోలీసులు ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఎంఈఓ వి.రాజబాబు, ఏపీఓ కుమారస్వామి, వెలుగు ఏపీఎం వై.వెంకట్, ఇంజినీరింగ్ అధికారి సత్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి

- మన్యం వీరుడు సీతారామరాజుకు ఘన నివాళులు
- ఆయన పోరాట పటిమను కొనియాడిన నేతలు

ఏలేశ్వరం: రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. పట్టణంలో సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో ఏలేశ్వరం, లింగంపర్తి, జె.అన్నవరం తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు కందుల క్రాంతి కుమార్, కె.కృపాప్రసాద్, చందక ప్రసాద్, గూనాపు సాయి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భద్రవరంలో సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోటనందూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శమని ప్రముఖ వ్యాపారవేత్త వెలగా వెంకటకృష్ణాజీ అన్నారు. కోటనందూరులో అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి 101వ వర్ధంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా అల్లూరి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వ హైస్కూళ్లలో చదివి 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ, యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలాజ్ కోశాధికారి అవసరాల దేవి, జిల్లా నాయకుడు బండారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, కార్యాలయ సిబ్బంది మూర్తి, సురేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



బూరుగుపూడిలోని అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు స్థానిక నాయకులతో కలసి అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు, మతోన్మాద, కార్పొరేట్ దోపిడీ దారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అల్లూరి సోదరుడి కుమార్తె సత్సమట్ల సత్యవతి, మనవడు శ్రీరామవెంకట క్రిష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, కుంచె అంజిబాబు, రాష్ట్ర కార్యదర్శి కుడితి సతీష్ పాల్గొన్నారు.

శంఖవరం: గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటిషు వారికి వ్యతిరేకంగా అల్లూరి చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకుడు మేకల కృష్ణ, రేలంగి నాగేశ్వరరావు, పిల్లా గంగాధర్, కర్రి వినోద్, సకిరెడ్డి బాబి, కోన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని మర్రిపాకలో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి నివాళులర్పించారు. ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.స్వాతంత్ర్య కోసం అల్లూరి చేసిన పోరాటలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ చంద్రరావు, ఏపీఓ కృష్ణంరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్, ఎంపీడీఓ కుమార్‌బాబు



కోటనందూరులో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తున్న వెంకటకృష్ణాజీ తదితరులు



ఏలేశ్వరం మండలం భద్రవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

వైభవంగా సామూహిక శ్రీలక్ష్మీనారాయణ వ్రతాలు


ఎస్.అన్నవరంలో సామూహిక శ్రీలక్ష్మీ నారాయణ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక శ్రీలక్ష్మీనారాయణ వ్రతాలను భక్తులు ఆచరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక శ్రీలక్ష్మీనారాయణ వ్రతాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. వేదపండితులతో పండిత సదశ్యం నిర్వహించారు.

నేడు శ్రీవారి కల్యాణం

పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం అనంతరం కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామిఅమ్మవార్ల దివ కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


తునిలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చోడిశెట్టి త్రిమూర్తిస్వామి

తుని: ప్రజల దాహార్తిని తీర్చేందుకు శంకర్ ఫౌండేషన్, సహస్ర హాస్పటల్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో తుని పట్టణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తులస్వామి, సహస్ర హాస్మిటల్ గ్రూప్ ఎండీ డాక్టర్ చోడిశెట్టి లోవరాజు ప్రారంభించారు. బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఏటా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఏర్పాటు చేశామని సిటీ కేబుల్ ఎండీ త్రిమూర్తులస్వామి తెలిపారు. కార్యక్రమంలో పాతసంచుల వర్తక సంఘం అధ్యక్షుడు గణపతికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


ఏలేశ్వరంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శ్రీకారం చుట్టారు. మండలంలోని రమణయ్యపేట, మార్కండేయపురం గ్రామాల్లో రెండు చేతిపంపుల ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఏలేశ్వరంలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు కుట్టుమెషీన్ శిక్షణను ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టు శిక్షణను ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


అప్పన్నపాలెంలో తల్లిదండ్రులకు వివరిస్తున్న ఎంఈఓ అబ్బాయి, ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ అబ్బాయి సూచించారు. పట్టణ పరిధిలోని అప్పన్నపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎస్. రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీతులసి, మండల ఉపాధ్యాయులు జె.సోమరాజు, కేఎస్ ప్రకాశరావు, రాజు, మురళి, రవి, సీఆర్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: స్థానిక సాయినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. పట్టణ పరిధిలోని పార్కు సెంటర్, సినిమా రోడ్డు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, గణపతినగర్, ఎంఆర్ పేట, లయోలా స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

తొండంగి: గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు బుధవారం తెలిపారు. ఎ.కొత్తపల్లి, అన్నవరం, తేటగుంట, గౌరమ్మపేట, కొత్తపేట, మండపం , గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి


ఏలేశ్వరంలో ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: విశ్వకవి, తత్వవేత్త రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్స్ కంప్యూటర్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలో మొట్టమొదటిసారిగా నోబెల్ బహుమతి పొందిన ఘనత ఠాగూర్‌కే దక్కుతుందన్నారు. విశ్వకవిగా ఠాగూర్ ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. విద్యార్థులు ఠాగూర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు నీలం సాయిదుర్గ, రాయల సాయి ఝాన్సీ, సత్యకనకదుర్గ, రామ్‌చరణ్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రజల అవసరాలను గుర్తించాలి

ప్రత్తిపాడు: అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు, ప్రజల అవసరాలను గుర్తించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు ఆదేశించారు. ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 2047 విజన్ ప్లాన్‌పై నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం విద్య, వైద్యం, నీటి పారుదల, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, విద్యుత్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం ఎంపీడీఓలు ఎంవీఆర్ కుమార్‌బాబు, జి శివరామకృష్ణ, ఎస్‌ఎంకేజీ ప్రసాద్, శంఖవరం తహసీల్దార్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

జగ్గంపేట: మనస్తాపంతో యువకుడు మృతి చెందినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేటకు చెందిన ఇమ్మెళ్ల గౌతమ్ కుమార్ (రాజ) (25) వ్యాపార లావాదేవీలలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడు తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



చూసిన కనులకు వైభోగం

- సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న పుష్పాలంకరణలు


ఆంజనేయ వాహనం మీద సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు


అనివేటి మండపం వద్ద ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాల శుభవేళ రత్నగిరి శోభాయమానంగా దర్శనమిస్తోంది. వైశాఖ శుద్ధ దశమి, బుధవారం సాయంత్రం సత్యదేవుడు, అమ్మవార్లను వధూవరులను చేయడంతో సత్యదేవుని కల్యణోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి 9.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవారి దివ్య కల్యాణం కన్నుల పండువగా జరుగనుంది. ఇందుకోసం దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13వ తేదీ వరకూ కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు.

దేదీప్యమానంగా..

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చేసిన పుష్పాలంకరణ ఆకట్టుకుంది. ప్రధానంగా అనివేటి మండపం ముందు ఏర్పాటు చేసిన సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులు, అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన అలంకరణలు అలరించాయి. పశ్చిమ రాజగోపురం వద్ద అందమైన ముగ్గులు మరంత శోభను తెచ్చిపెట్టాయి. విద్యుత్ అలంకరణ కూడా భక్తులను ఎంతగానో అకట్టుకుంది.

ఘనంగా సీతారాముల ఊరేగింపు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల తొలి రోజు బుధవారం రాత్రి సత్యదేవుడు, అమ్మవారి వివాహానికి పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తున్న సీతారాములను ఆంజనేయ వాహనం మీద అన్నవర పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి 10.30 గంటల వరకు ఊరేగింపు కొనసాగింది. ఆదివారం రాత్రి జరగనున్న సత్యదేవుని వివాహానికి అంద రూ విచ్చేయాలని సీతారాముల తరఫున అర్చకులు భక్తులు, గ్రామస్తుల ను కోరారు. అధి క సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.


అనివేటి మండపంలో ఆకట్టుకున్న ప్రత్యేక పుష్పాలంకరణ


రాజగోపురానికి ప్రత్యేక విద్యుత్ అలంకరణ

పేద విద్యార్థికి చేయూత

గండేపల్లి: మండలంలో నీలాద్రిరావుపేట సహస్ర విద్యానికేతన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఈ ఏడాది నుంచి ఉచిత విద్యను అందిస్తున్నట్టు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మణికంఠ బుధవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పేద విద్యార్థి మాగంటి రక్షణకు ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకూ అన్ని వసతులతో పూర్తిగా ఉచిత విద్యను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ 24న నిర్వహించిన స్మార్ట్ పరీక్షల ద్వారా రక్షణను ఎంపిక చేశామన్నారు. కాశీ అన్నపూర్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా ఇద్దరు విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు.